# జానీ జానీ...

**సుం**దరికి తన పిల్లాడిని చాలా క్రమశిక్షణలో పెంచాలని కోరిక. అందుకే ఉద్యోగంలో చేరకుండా, పిల్లాడిని చూసుకోవటమే నాకు పెద్ద ఉద్యోగం అని గర్వంగా అందరితో చెప్తుంది.

"జానీ జానీ యస్ పప్పా" చెప్తోంది సుందరి బంటూతో... రెండుసార్లు చెప్పాడు. పిల్లాడికి అన్నీ తనే నేర్పేసి స్కూల్లో అందరిలోనూ వాడే ఫస్టు అనేలా చేయాలి అని మహా సతమతమయిపోతుంది సుందరి. "బంగారు తండ్రివి కదూ, మళ్ళీ చెప్పు" అంది వాడితో. "జానీ జానీ వాట్ పప్పు - మమ్మీ అన్నం తింటా అన్నాడు బొమ్మని ఒళ్ళోకి తీసుకుని, డైనింగ్ టేబుల్ దగ్గర కూచుంటూ... సుందరికి చాలా విచారం కలిగింది, ఈ పిల్లాడికి మంచి స్కూల్లో సీటు ఎలా వస్తుందోనని.

పిల్లాడు అన్నం తినటం అయింది... యాపిల్ తింటానని పేచీ... అదీ తిన్నాడు... పోన్లే... వాడికిష్టం లేని 'జానీ జానీ - ఎందుకూ, మరోటి నేర్పాలి' అనుకుంటూ నిద్రపుచ్చింది పసివాణ్ణి.

అందరి పిల్లలకన్నా తన పిల్లాడు స్పెషల్‌గా పెరగాలనే గాఢమైన కోరిక సుందరి మనసులో రోజు రోజుకీ నాటుకుపోతోంది.

భర్త సుబ్బారావు ఆఫీసునుంచి రాగానే "మీరసలు పట్టించుకోరు వాడి చదువు విషయం" అంది సుందరి.

'ఎవడి చదువు విషయం' అన్నాడు కాఫీ తాగుతూ, పేపరు తిరగేస్తూ.

'అదే - బంటూ చదువు' అంది.

సుబ్బారావుకి చాలా నవ్వొచ్చింది - 'వాడు, వాడి చదువు - ఊరుకో అన్నీ అవే వస్తాయి... సినీమాకెడదాం, రెడీకా' అన్నాడు.

'దేవదాసు సినిమా - ఆ ఖరీదయిన డ్రెస్సులు చూసే భాగ్యం వుంటే త్వరగా రా' అన్నాడు మళ్ళా సుబ్బారావు.

సుబ్బారావు మాటలకి మండిపడుతూ, 'నేను రాను - పిల్లాడి చదువు విషయం వదిలేసి, సినిమాకా' అంది, సుబ్బారావు పగలపడి నవ్వాడు. సుందరి బుగ్గలు కోపంతో కందిపోయాయి.

'నాన్నా, నా చిన్నా, నీకు ఐస్‌క్రీమ్ కొనిపెట్టనా' అంది పక్కన బంటూని కూచోపెట్టుకుని...

'ఆ' అన్నాడు బుద్ధిగా బంటూ... సుందరి బాబుని ఒళ్ళో కూచోపెట్టుకుని "బాబా బ్లాక్ షీప్" - మొదలు పెట్టింది... ఏది ఐస్‌క్రీమ్ - బంటూ అమ్మ ఒడిలోంచి ఫ్రిజ్ వైపు పరిగెత్తాడు.

"ఇది నేర్చుకో, కొనిపెడతా" అంది.

"బాబా... బ్లాక్ షీప్ - కళ్ళు, చేతులు తిప్పుతూ చక్కగా చెప్పింది సుందరి. బంటూ "బాబా - బ్లాక్ కాట్ - పిల్లి" అన్నాడు. ఒళ్ళు మండిపోయింది తల్లికి. పిల్లీలేదు... కుక్కాలేదు," బ్లాక్ షీప్, హావ్ యు ఎనీ ఊల్" అంది బంటూతో...

ఒక్క పరుగున బయటికెళ్ళాడు బంటూ.

ఏం చేస్తుంది తల్లి?... గుమ్మంలో నుంచుంది. పక్కనే పెద్ద ఇల్లు కడుతున్నారు... ఎందరో చిన్నపిల్లలు ఇసుకకుప్ప మీద కూచుని ఆడుకుంటున్నారు. బంటూ వాళ్ళ మధ్యలోకి పోయాడు...

కోపంగా లోపలకొచ్చి సోఫాలో కూలబడి పోయింది తల్లి - అయ్యో వీడు పరీక్షలెలా పాసవుతాడు అనే బెంగతో.

పది నిముషాల్లో బంటూ గుప్పెడు ఇసుక పట్టుకొచ్చాడు... చిన్న చిన్న రాళ్ళు, నన్నగా వున్నవి కొన్ని ఉన్నాయి అందులో, 'ఇవి గోళీలు' అన్నాడు....

తల్లి అనుకుంటోంది ఆడుకునే గోళీకాయలాంటివి ఎంత చిన్నవి ఏరుకున్నాడో అనుకుని వాటికేసి చూస్తూ - వాడు మమ్మీ 'ఇవి రాత్రి బబ్బునేప్పుడేనుకుంటా - అప్పుడర్థమయింది తల్లికి వాడనేవి గోళీలు వేసుకునే మాత్రలనుకుంటున్నాడు. అయ్యో! గబగబా జేబులు దులిపి ఇవి మింగితే పొట్టనొప్పి వచ్చేస్తుంది' అంది.

'మింగను, కొరికి తింటా' అన్నాడు ఆ కింద పడ్డవి ఏరుతూ... 'కింద పడ్డవి తినకూడదు' అంటూ ఏరే లోపల రెండు చిన్న సైజుని జేబులో దాచుకున్నాడు.

సుందరికి విసుగొచ్చేస్తోంది. ఈ పిల్లాడికి చదువు చెప్పలేను, క్రమశిక్షణలో పెట్టలేను అనిపించింది ఆ తల్లికి.

చదువురాకపోతే, వాళ్ళ బాబాయిలా పొలం పనులు చూసుకుంటాడు, అంతే అనుకుంది ఎంతో నిరాశతో. తన చెల్లి కొడుకు అమెరికా నుంచి వచ్చి ఎంత బాగా ఇంగ్లీషు మాట్లాడాడో - వీడికేం తెలుస్తుందీ!!

బంటూ, తల్లి డ్రెస్సింగ్ టేబుల్ దగ్గర నిలబడ్డాడు. పౌడరు రాసుకోవటం తెలుసు. బొట్టుపెట్టుకోవటం తెలుసు... కానీ అక్కడున్న మరోటి, దాని పేరు తెలియదు. అయినా, గబుక్కున తీసి పెదాలకి పూసేసుకున్నాడు.

అవన్నీ పక్కింటి అక్కకి చూపించాలని వాడి సరదా... పక్కింట్లోకెళ్ళిన బంటూని చూస్తూ ఆ ఆరోక్లాసు చదివే అక్క 'బంటూ, ఇదేమిటీ' అంది. 'పౌడరు' అన్నాడు. 'ఇదో' అంది బొట్టు, మమ్మీ పెట్టుకుంటుందిగా అన్నాడు. మరి ఇదో అంది. దాని పేరే వాడికి తెలియదు. అయినా వాడు మూతి గుండ్రంగా తిప్పాడు. ముద్దు పెట్టేట్టు మూతి చూపించాడు. చిన్న పెదాలు ముందుకు పెట్టాడు. మూతి ముందు పెట్టి "ముద్దు ముద్దు" అన్నాడు అక్క నవ్వి, నవ్వి తల్లిదగ్గరకెత్తుకొచ్చింది.

వాడేదో పెద్ద బూతు మాట అంటున్నట్టు నోటికి చెయ్యి అడ్డం పెట్టుకుంటూ, 'ఆంటీ వీడు ముద్దు, ముద్దు అంటున్నాడు' అంది...

ఎవరు చెప్తున్నారు మాటలూ -

ఇంకెవరూ - అయినా అంత పసివాడు ముద్దు పెట్టడం గురించి అంటున్నాడంటే, వీడిని ఎవరు చెడగొడుతున్నారూ - సుందరి చింత మరీ పెరిగింది ఆత్రంలో.

"ముద్దులు కౌగిలింతలు ఇప్పుడే వీడికి నేర్పేస్తున్నారా" - భద్రకాళిలా, భర్త వైపు చూస్తూ అరిచింది సుందరి. సుబ్బారావు టివిలో క్రికెట్ చూస్తూ "ఉష్, వెరీ గుడ్ ఫోర్" అన్నాడు పెద్ద కేకపెట్టి -

"మిమ్మల్నే"

"ఏమిటి - వాడు చూడండి పెదాలకి లిప్‌స్టిక్ పూసుకుని దాంతో ముద్దు అన్నాడు" అంది.

"నీ మొఖం... బంటూ, ఇటురా" అన్నాడు సుబ్బారావు.

"ముద్దు పెట్టుకుంటావా"

"ఊఊ - తల అడ్డంగా తిప్పాడు.

అమ్మ ముద్దు పెట్టుకుందా, సుబ్బారావు సుందరి వైపు చూసి నవ్వుతూ 'నన్ను' అన్నాడు నెమ్మదిగా.

ఊఊ - తల అడ్డంగా తిప్పాడు.

బంటూ పరిగెత్తికెళ్ళి లిప్‌స్టిక్ తెచ్చాడు.

'ఇది' అన్నాడు... సుబ్బావురావు విరగబడి నవ్వాడు. ముఖానికి రాసుకునేది పౌడరు, నుదుట పెట్టుకునేది బొట్టు, పెదాలకి రాసుకునేదాని పేరు తెలియదు - అందుకు 'ముద్దు' దాని పేరన్నమాట - ఎంత తెలివైనవాడో వీడు - గొప్ప భాషా శాస్త్రవేత్త అవుతాడు - సుబ్బారావు వచ్చే నవ్వు అపుకుంటుంటే సుందరి నవ్వకుండా మూతి బిగించి 'మీరయ్యారుగా, ఇంక వాడవుతాడు. అంతే తండ్రి బుద్ధులే - వీడికి చదువేం వస్తుందీ' అంది ఎంతో నిరాశగా.

వారం రోజులయింది - బంటూ... స్కూలికెడుతున్నాడు. తల్లి చాలా సంతోషంగా, టీచరు నిన్ను స్కూలు కెళ్ళగానే ఏమందీ అంది. గుడ్ మార్నింగ్ అంది మమ్మీ - నువ్వేమన్నావు' అంది సుందరి.

'గుడ్డు నేను తిన్నా, మా మమ్మీ పెట్టింది' అని అంటూ జేబులో వున్న చాక్లెట్ తినటం మొదలెట్టాను.

'వీడికేమీ రావు - ఆ తండ్రి పట్టించుకోడు' సుందరికి చిరాకొచ్చేసింది!! ఇక ట్యూషన్ మాష్టర్ని పెట్టాలని నిశ్చయించింది ఆ రోజే.

కాలం పరిగెత్తింది... సుందరి తలలో వెండి తీగలు మెరుస్తున్నాయి... కలక్టరు చంద్రశేఖరు, భార్య సురేఖతో, మూడేళ్ళ మధుతో కలిసి పండక్కి తల్లిదండ్రుల్ని చూడటానికొచ్చాడు. కలెక్టర్ చంద్రశేఖర్, అదే బంటూ భోజనాలు చేస్తూ "అమ్మా ఈ మధు ఒక్క మాట వినడు - పైగా తల్లి చెప్తే చదువుకోడు - పైగా, వాళ్ళమ్మ వీడికి చదువు చెప్పలేక విసిగిపోతోందనుకో" అన్నాడు.

"అవునత్తయ్యా... 'జానీ జానీ వాట్ పప్పా' అనమంటే 'జానీ జానీ వాట్ మమ్మీ' అంటాడు. మొన్న స్టేషన్లో కాఫీ, కాఫీ అని అమ్ముతుంటే వాడి పక్కన కూచుని రానంటాడు - చిట్టీ చిలకమ్మా - అనమంటే పొట్టి పిలకమ్మా అంటున్నాడు - వీడికి చదువొస్తుందనే నమ్మకం కలగటంలేదు - కోడలు మాటలు విని వచ్చే నవ్వు ఆపుకున్నాడు మామగారు సుబ్బారావు.

"మీకు నవ్వొస్తోందా మామయ్యా... వాడికి చదువురాకపోతే ఎంత కష్టమో మీకేం తెలుసు. ఇవి మీ రోజులు కావు' అంది సురేఖ.

"పీక కోస్తా... డిషుమ్..." మధు ఓ చిన్న గరిటపట్టుకుని తల్లి దగ్గరకొచ్చాడు.

'ఇదీ గోల - ఇంద్ర సినిమా చూసాడు - అదే' అంది సురేఖ వాడి చేతిలోంచి గంప లాక్కుంటూ - కాలం పరిగెడుతూనే ఉంది.

'కలెక్టరు గారబ్బాయి మంచి ర్యాంకులో పాసయ్యాడు చూసావా' అన్నాడు సుబ్బారావు భార్యతో - మనుమడు ఇంటర్మీడియెట్ అయి ఎంసెట్లో మంచి ర్యాంకు వచ్చినందుకు గర్వపడుతూ.

"ఎందుకు రాడూ - వాడి నాన్న బంటూను ఎంతో డిసిప్లిన్లో పెంచాను' అంది భార్య సుందరి.

ఫోన్ మోగింది...

విశాఖపట్నం నుంచి 'బామ్మ, మీరు తాతయ్యా రండి' అంటున్నాడు మనుమడు మధు.

'చూడండి అత్తయ్య - మనం మంచి ర్యాంక్ అనుకుంటున్నాం కానీ ఆ రాంకుకి సీటు వస్తుంది కానీ దూరం కాలేజిలో - అదే బెంగ...' ఫోన్ కట్ అయింది.

కొందరికి బెంగలు లేకపోతే తోచదులే అన్నాడు సుబ్బారావు...

'పోన్లెండి - ఏం బెంగలూ లేకుండా క్రికెట్, టెన్నిస్ మీరు చూసినా - నేనూ నా కోడలు పిల్లల్ని చదివించేస్తాం కదా...' అంది గర్వంగా కలెక్టర్‌గారి తల్లి సుందరి.

కాలం పరిగెడుతుంటే, పిల్లల చదువుల గురించి తల్లిదండ్రుల ఆవేదనని ఇంటింటా చూస్తూన్న ముసలి తాతగారి తెల్లని మీసాలపై చిరునవ్వు మెరుస్తూనే వుంటుంది.

బాల్యం ఏదీ? - ఎక్కడికిపోయిందీ!!

లేవటం లేవటమే బడి, బడి అంటూ ఊదరగొట్టేస్తున్న అమ్మలు, నాన్నలు, హోంవర్కుల ఉక్కిరిబిక్కిరిలో చిక్కిపోతున్న పిల్లలు, ట్యూషన్లు చెప్పి చెప్పి బలిసిపోతున్న మాష్టరు, నిలబడి టిఫిన్ తిని, బస్సులో నిద్రపోయే పసివాళ్ళకు... ఎందర్నో ఎదుర్కొని ఎక్కడ నిలుస్తుందీ బాల్యం?!... పడక్కుర్చీలో పడుకున్న సుబ్బారావు తాతయ్యకి, కోడలి గొంతు ఖంగున వినిపించింది.

"నేర్పించండీ - జానీ జానీ... అది నోటికి రాకపోతే వాడి టీచరు కొడుతుంది - ఈ రెసిటేషన్ పరీక్షలో పానవుతాడో లేదోననే భయం - మీకేం వినిపించటంలేదా" - విశ్రాంతిగా పేపరు చదువుకుంటున్న కొడుకు చేతిలోంచి పేపరు లాక్కుంది కోడలు.

ముసలాయన నవ్వు కట్టలు తెంచుకుంది.

"ఇక బాల్యం అంటే జానీ జానీ లేకపోతే కంప్యూటర్ లేకపోతే భుజాన గోనె సంచి" -

ఇంతే - మళ్ళా మళ్ళా నవ్వాడు.

ఆ నవ్వు విని "ఆ ముసలాయనకి పని పాటాలేదుగా అంతే" అంది భర్తతో భార్య, పసివాడి నోట్లో ఇడ్లీ ముక్క కుక్కుతూ!!

- ఆంధ్రభూమి దిన పత్రిక 28 ఆగష్టు 2004